క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని మహంకాళి అమ్మవారిని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ ఆదివారం దర్శించుకున్నారు. మహంకాళి బోనాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కెరమెరి: మండలంలో పండ్ల తోటల పెంపకానికి ఆసక్తిగల రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఈజీఎస్ ఏపీవో మల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలోని చిన్న, సన్నకారు 5 ఎకరాలోపు రైతులను ఎంపిక చేస్తామన్నారు. మామిడి, జామ, నిమ్మ మొక్కలను పెంచాల్సి ఉంటుందని తెలిపారు. ఉపాధిహామీ, జాబ్‌కార్డు, పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డుతో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి తీర్మానపత్రాన్ని ఈ నెల 15లోపు ఈజీఎస్ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

అంత్యక్రియల్లో ఎంపీ, ఎమ్మెల్యే

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ చట్ల గజ్జయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం గ్రామానికి చేరుకుని మృతుడు చట్ల గజ్జయ్య అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

డ్రెయినేజీ పూడిక తీయించాలి


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

సాత్నాల: భోరజ్ మండలంలోని కోరట గ్రామంలో డ్రెయినేజీ పూడిక తీయకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురికి కాలువల పూడికలు తీయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని ఎస్సీ కాలనీవాసులు వాపోతున్నారు. మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్గంధం వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పూడిక తీయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై


ఎస్సై శ్రీసాయి

బోథ్: నూతన ఎస్సైగా శ్రీసాయి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇ దివరకు ఎస్సైగా విధులు నిర్వహించిన ఎల్. ప్రవీ ణ్ కుమార్ మావల మండలానికి బదిలీ అ య్యా రు. నూతన ఎస్సై మాట్లాడుతూ.. ప్రజల భ ద్రతకు పేద్దపీట వేస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతామన్నారు. యు వత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

మంత్రికి కాంగ్రెస్ శ్రేణుల ఘన స్వాగతం


స్వాగతం పలుకుతున్న నాయకులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. మావల మండల కేంద్రంలోని బైపాస్ వద్దకు చేరుకున్న ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. స్వాగతం పలికిన వారిలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడె గజేందర్, పసుల చంటి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగునీరు



వాంకిడి మండలంలోని కనర్‌గాం గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో బోరుబావి నుంచి వచ్చే నీరు రోడ్డుపై పారుతుంది. దీంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారుతుంది. ఈ విషయం పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. – వాంకిడి

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా?



దహెగాం: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటీడీఏ ఏర్పాటు చేసినా.. గిరిజన గ్రామాల్లో కనీసం సౌకర్యాలు కరువయ్యాయి. లోహా గ్రామానికి వెళ్లేందుకు ఉన్న మట్టిరోడ్డు బురదమయంగా మారుతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర వేళల్లో ఇక అంతే సంగతి. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆహ్లాదం.. ఆనందం..



కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లగౌడ్‌తోట చిల్డ్రన్స్ పార్క్ ఆహ్లాదంతో పాటు ఆనందాన్ని పంచుతుంది. ప్రతీ రోజు ఉదయం సాయంత్రం పిల్లలు, పెద్దలు పార్కుకు వచ్చి చల్లటి వాతావరణంలో సేదతీరుతు వాకింగ్ చేస్తున్నారు. ఆదివారం పిల్లలకు సెలవు కావడంతో సాయంత్రం పార్కులో ఆనందంగా ఆటలాడుకుంటున్నారు.

వరదొస్తే రాకపోకలు బంద్


ఐనం వద్ద లోలెవల్ వంతెన పైనుంచి పారుతున్న వరద (ఫైల్)

- లోలెవల్ వంతెనలతో ఇబ్బందులు
- ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితి

దహెగాం: ప్రతీ సంవత్సరం వర్షాకాలం వచ్చిందంటే చాలు మండలవాసులకు లోలెవల్ కష్టాలు తప్పడం లేదు. మండల కేంద్రం సమీపంలో ఐనం వద్ద రెండు లోలెవల్ వంతెనలు ఉన్నాయి. దీంతో భారీ వర్షాలు వస్తే లోలెవల్ వంతెనపై నుంచి వరద పారుతున్నందున రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అదే విధంగా పెద్దవాగు ఉప్పొంగితే వరద నీరు కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపైకి వచ్చి రాకపోకలు స్తంభిస్తున్నాయి. గత నాలుగు సంవత్సరాల క్రితం దహెగాం నుంచి కాగజ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారి ఐనం, పెసరికుంట, ఇట్యాల వద్ద ప్రధాన రహదారిపైకి వరద చేరి అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. లోలెవల్ వంతెనలతో ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఐనం వద్ద రెండు లోలెవల్ వంతెనలు..

మండలంలోని ఐనం గ్రామం వద్ద రెండు లోలెవల్ వంతెనలు ఉన్నాయి. భారీ వర్షాలు కురిస్తే వరద నీరు వంతెనపై నుంచి పారుతుంది. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని వాపోతున్నారు. లోలెవల్ వంతెనలపై నుంచి వరద నీరు తక్కువగా ఉందని వాహణదారులు దాటే క్రమంలో వాహనాలు పొడవుతున్నాయన్నారు. వరద నీరు వస్తే దాటడానికి సైతం ఇబ్బందిగా మారుతుందని పలువురు వాపోతున్నారు.

మండల కేంద్రం సమీపంలో..

మండల కేంద్రం నుంచి కల్వాడ గ్రామం వైపు వెళ్లే దారిలో నయారా పెట్రోల్ పంపు సమీపంలో లోలెవల్ వంతెన ఉంది. భారీ వర్షాలకు లోలెవల్ వంతెన పైనుంచి వరద పారుతుందని ఆ సమయంలో దాటలేక హత్తిని మీదుగా తిరిగి ప్రయాణం చేయాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. లోలెవల్ వంతెనలపై గుంతలు ఏర్పడి ఉండడంతో వాహనాలు కూరుకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద నీరు వచ్చిన సమయంలో గంటల తరబడి రాకపోకలు స్తంభిస్తున్నాయన్నారు. నిత్యం కాగజ్‌నగర్, మంచిర్యాల పట్టణాలకు పదుల సంఖ్యలో ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. వర్షాకాలం వచ్చిందంటే లోలెవల్ కష్టాలు వెంటాడుతున్నాయని వాపోతున్నారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్యలను వివరించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని బాలభారతి ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. 28 ఏళ్ల తరువాత అందరూ ఒక్కచోట కలుసుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలోని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనాడు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నీలి సతీష్, రాచర్ల రవీందర్, పడాల శ్రీధర్, నాగరాజు, తేలి శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు


నెత్తిన బోనం ఎత్తుకుని మైసమ్మ ఆలయానికి వెళ్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



అమ్మవారికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన: మండలంలోని వంకులం గ్రామ మహిళలు ఆదివారం పెద్దవాగు ఒడ్డున గల గాంధారి మైసమ్మ ఆలయంలో జరిగిన పోశమ్మ బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొన్నారు. మహిళలతో కలిసి అమ్మవారి బోనాన్ని ఎత్తుకుని డప్పువాయిద్యాలతో ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలు సుఖ శాంతులతో, అష్టఐశ్వర్యాలతో రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమాల్లో సింగిల్ విండో వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు తిరుపతి, అజ్మీర మురళీధర్, ఓమాజీ, నాగయ్య, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు రవీందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్అర్బన్: ఆషాఢమాసం పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని రాజంపేట కాలనీకి చెందిన భక్తులు పోచమ్మ తల్లి అమ్మవారికి సామూహికంగా బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతీ సంవత్సరం డప్పు చప్పుళ్లతో బోనాలను చెల్లించడం ఆనవాయితీగా వస్తుందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించడం ద్వారా పాడి పంటలు పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు.

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఆదివారం బోనాల పండుగను జరుపుకున్నారు. మహిళలు పోచమ్మ, మైసమ్మ, బారులమ్మలకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. విస్తారంగా వర్షాలుగా కురిసి పంటలు సంమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడావి రేణుక, మహిళలు సీతల్, శంతబాయి, కల్పన, అనురాధ, జీజబాయి, రమ్యలత పాల్గొన్నారు.


ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు


బోనాలతో మహిళలు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని వివిధ గ్రామాల్లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆదివారం పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి నేరుగా వారికి అందజేశారు. భట్టుపల్లి, అందవెల్లి, సార్సాల, ఈస్‌గాం గ్రామాల్లో అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుల్ల అశోక్, మాజీ ఎంపీటీసీ తిరుపతి, మొండి, మండల ప్రధాన కార్యదర్శి రావుల నరేశ్, విశాల్ పాల్గొన్నారు .

ఈస్‌గాంలో వనమహోత్సవం


మొక్క నాటుతున్న ఆలయ ఈవో, సభ్యులు

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని ఈస్‌గాం శివాలయం ప్రాంగణంలో వనమహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వేణుగోపాల్ గుప్తా, ఆలయ కమిటీ సభ్యులు మొక్కలు నాటారు. ఈవో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గిరిజనేతరుల సమస్యలపై సీఎంతో మాట్లాడుతా


మాట్లాడుతున్న మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

- రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటున్న గిరిజనేతరుల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి పరిష్కరించడానికి కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు కాంబ్లె బాలాజీ సోదరుని వివాహానికి మంత్రి హాజరయ్యారు. తొలిసారిగా మండలానికి వచ్చేసిన మంత్రికి కాంగ్రెస్, దళిత సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నార్నూర్‌లో కొలాం ధరి, ఎంపల్లి ప్రాజెక్ట్ మంజూరు కోసం చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల, ఉన్నత విద్యకోసం డిగ్రీ కళాశాల, నార్నూర్‌లో అంబేద్కర్ భవన్, సేవాలాల్ భవన్, షాదీఖానా మంజూరు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్, కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ యూనుస్ అక్బానీ, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్‌నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ దుర్గే కాంతరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లోఖండే దేవురావు, మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు లోఖండే చంద్రశేఖర్, దళితరత్న అవార్డు గ్రహీత నర్సింగ్‌మోరే, ఫాక్స్ చైర్మన్ అడే సురేశ్, ఏఎంసీ డైరెక్టర్ కైలాస్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగిన మహోన్నతుడు అంబేద్కర్

తాంసి: ప్రజలందరికి సమాన హక్కులు కల్పించడానికి భారత రాజ్యాంగాన్ని రచించిన మహోన్నతుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్మించిన అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆదిలాబాద్ ఎంపీ నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, విగ్రహదాతలు కాటిపెల్లి వసంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రితో పాటు ఎంపీ ఎమ్మెల్యేలను అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న పలు సమస్యలను మండల నాయకులు మంత్రికి విన్నవించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా బోథ్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎంపీ నగేశ్ మాట్లాడుతూ తలమడుగు మండలంలో బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి గజేందర్, మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, మాజీ జెడ్పీటీసీలు గణేశ్‌రెడ్డి, రాజు, బాబన్న పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన రూపేష్‌రెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు తగిన ప్రాధాన్యతనిచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల పండుగ


సుంకిడిలో బోనమెత్తుకున్న మంత్రి వివేక్

తాంసి: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం తలమడుగు మండలంలోని సుంకిడిలో బోనాల పండుగ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేశ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. బోనం ఎత్తుకొని గ్రామస్తులతో కలిసి పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు గోక గణేశ్‌రెడ్డి, తాటిపెల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగాపూర్ బాలాజీ గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌లో గల సుప్రసిద్ధ శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఆదివారం భక్తులు అత్యంత భక్తిశద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం భక్తులు గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. గోవింద గోవిందా అంటూ స్మరించుకుంటూ భక్తిపారవశ్యంతో స్వామి వారి నామస్మరణ చేస్తూ గిరి ప్రదక్షిణ పూర్తి చేశారు. రోజురోజుకు గిరి ప్రదక్షిణ చేసే భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడుతోంది.

'యాగాన్ని విజయవంతం చేయాలి'

ఆసిఫాబాద్అర్బన్: హైదరాబాద్‌లోని కాచిగూడ తుల్జాభవన్‌లో రాష్ట్ర ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాదు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే పంచకుండాత్మక చండీ, కుబేర పాశుపత యాగంలో జిల్లాలోని డీడీఎన్ అర్చకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని డీడీఎన్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మొదటి రోజులో భాగంగా గణపతిపూజ, పుణ్యాహవాచనం, మూలమంత్ర అనుష్టానములు, ప్రధాన మంటప దేవతహోమం, నవగ్రహ హోమం, రెండోరోజు తేదీ రుద్ర చండి, కుబేర పాశుపత హోమం, 16వ తేదీన మహా పూర్ణాహుతి కార్యక్రమంతో ముగుస్తుందని తెలిపారు. అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పోచమ్మకు ప్రత్యేక పూజలు


మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు

కాగజ్‌నగర్ టౌన్: ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పోచమ్మ దేవాలయంలో ఆదివారం మహిళలు అధిక సంఖ్యలో దేవాలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని, పంటలు పండాలని, కుటుంబాలు ఆరోగ్యంగా ఉండాలని ఆలయంలో ప్రదర్శనలు చేసి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. మహిళలు అధిక సంఖ్యలో రావడంతో ఆలయం కిక్కిరిసి పోయింది.